

# పాన్‌షేత్ భగ్నప్రణయిని

కొమరవోలు వెంకట సుబ్బారావు

*ఆనకట్ట భగ్నమైంది. జలప్రళయం సంభవించింది. విశేషమైన నష్టమూ సంభవించింది. ఇంతకూ కారణం ఏమైనా కానీండి. మూగ బుద్ధ దేవుని మూర్తి ముందర మునివ్రేళ్ళతో కేవలం ఒక్క గన్నేరు పువ్వు పట్టుకొని విలపిస్తూ కూర్చున్న ఈ భగ్నప్రణయిని ఎవ్వరు?*

---

**ఇల్లా** అవుతుందని కలలో కూడా అనుకోలేదు. అతనల్లా చేస్తాడనే అనుమానం కూడా నా కెన్నడూ కలగిలేదు. నా ముఖంలో ముఖం పెట్టి తాను వీడ చూచుకుంటున్నప్పుడూ, తన వ్రేళ్లకు నాశిరోజాలను ఉంగరాలలాగా సుతారంగా మెలివేసుకుంటున్నప్పుడూ, అతని నవ్వులు నా పెదవులమీద తాండవమాడుతున్నప్పుడూ ఈ జన్మానికి ఆ పెన్నిధానం అంతా నాదే ననిపించేలాగా, నా సోయగమంతా తనదే అనిపించేలాగా ప్రవర్తించేవాడు. వేయి జన్మాంతర సంస్కారాలను అందిస్తున్నట్లుగా అతని కళ్లు గంటల తరబడి నన్నలా నిలవబెట్టి చూస్తూ ఉండేవి. నన్నెంత చూచినా, ఎంత పరిశీలించినా అతనికి తనివితీరేదికాదు. నాలో

# పాన్‌షెత్ భగ్నప్రణయిని

ఏమంత అపురూప లావణ్యం ఉన్నదో నాకే తెలియదు. కాని, అతనికి మాత్రం ఎంత అనుభవించినా, ఇంకా అంతుదొరకనట్లే అని పించేది.

అబ్బ! ఆ కళ్లు ఇంకా నన్ను గుచ్చిగుచ్చి చూస్తున్నట్లే ఉన్నాయి....ఒంటరిగా యాథాలాపంగా తోటలో బెంచీమీద సగం విచ్చీవిచ్చని సిగ్గుమోసే గులాబీ మొగ్గను చూస్తూ కూర్చునేదాన్ని. పరధ్యానంలో ఉన్న నన్ను ఏవో రెండు చల్లనిచేతులు వచ్చి కళ్లుమూసి వెన్నవైపోయేవి. నేను విడిపించుకోడానికి ప్రయత్నించేదాన్ని. ఆ చేతులు అక్కడినుంచి భుజాలమీదకు, బుగ్గలమీదకు, పెదవులమీదకు ప్రసరించేవి. నాకు స్మృతితప్పి పడిపోయే టంత తన్మయత్వం వచ్చేది. ప్రక్కకువచ్చి నన్ను గట్టిగా అనుకొని కూర్చుండేవాడు. మెడమీదుగా చేయివేసి, మమ్ములను చూచి పెదవులు విప్పే గులాబి మొగ్గను త్రుంచి తల్లో తురిమేవాడు. నా ఒళ్లంతా గగుర్పొడిచేది. అబ్బ! అతను నా ఒళ్లంతా నవరిస్తున్నట్లే ఉన్నది—ఈ ప్రశయక్షణంలో గూడా!

• • •

ఒక్క పూవుపెట్ట నన్నలంకరిస్తే అతనికి తనివితీరేదికాదు. ఒళ్లు కనబడకుండా పూలతోనింపివేసి, మల్లెమొగ్గల తలంబ్రాలు పోసి, పూలరథంమీద ఊరేగించి, పూలపాన్పు మీద పడుకోబెట్టి—ఇంకా ఎన్నెన్ని రకాల పూలచేత నాకు సేవలు చేయించవచ్చునో అన్ని రకాలుగానూ వాటితో నన్ను ముంచెత్తి తప్ప అతనికి తృప్తి కలిగేదికాదు. కాని నాకు మాత్రం ఇదంతా వెగటుటీపిలాగా అనిపించేది. చిరునవ్వు లొలికించే చిన్ని గులాబీ మొగ్గను ఒక్కదాన్ని కసుగందకుండా త్రుంచి, చేతులు తగలకుండా, తలకట్టు చెదరకుండా జడలో తురిమితే చాలు, నాకు బ్రహ్మానందమై పోయేది. ఒక్క చూపుతోనే వీర్రైపోయేదాన్ని నేను. అల్పసంతుష్టి నా సొమ్ము. కాని అతడు నన్ను ఊపిరాడనిచ్చేవాడు కాడు. ఏవిషయంలోనూ నాది అతి లేతపాకం, అతనిది అతిముదురుపాకంగా మా జీవిత పరిణామాలన్నీ రూపొందినై. ఈ రెంటికీ సామరస్యం కుదరకపోవడమే నా గ్రహచారం...దీనికి నా ఎదురుగా మూగ మూర్తిలాగా కూర్చుని తన నితాంతమౌనశాంతితో నా నిశ్శబ్ద హత భాగ్యజీవితాన్ని లీనం చేసుకుంటున్న ఈ బుద్ధభగవానుడే ఏకైకసాక్షి.

## 2

పెళ్లికాకముందు అతనూ నేనూ ఒకే స్కూల్లో చదువుకుంటూ ఉండేవాళ్లం. పేటలో మా ఇళ్లుకూడా ఎదురెదురుగానే ఉండేవి. నాతండ్రి వకీలు, అతని తండ్రి ఇంజనీరుగా పనిచేస్తూ ఉండేవారు. ఆ ఇళ్లు కట్టినప్పటినుంచేకాక, చిన్నప్పటినుంచీ కూడా మా నాన్నగారూ, మా మామగారూ సహాధ్యాయులై ఉండడము మూలాన చాలా కాలంనుంచి ఆ ఇంటికీ ఈ ఇంటికీ చక్కని సంబంధ సన్నివేశాలు నడుస్తూ ఉండేవి. వారిద్దరూ చిన్నప్పుడు అనుకున్నారట—అందులో ఎవరికి ఆడపిల్ల పుట్టినా రెండోవారి కొడుక్కిచ్చి వివాహం చేసుకుంటామని. ఒకేరోజున ఇంజనీరుగారికి మావారూ, వకీలుగారికి నేనూ జన్మించాము. పుట్టిన నాలుగో నాడే ఒక్క తొట్టెలో మా ఇద్దరినీ పడుకోబెట్టేశారట ఆ మిత్రులిద్దరూ.

చిన్నప్పటినుంచీ మా పెంపకమూ అలాగే జరిగింది. ఒకే పేరాంబులేటరులో విహారం, ఒకే దాయీ చేతి పెంపకం—అంటే చదువుకునే వాళ్లకు సందేహం కలుగవచ్చు. రెండిళ్లలో పిల్లలను ఒకేసారి ఒక్కదాయీ ఎలా పెంచ గలుగుతుందని. అసలు కథ ఏమిటంటే, ఆ ఇంట్లో ఒకతె, ఈ ఇంట్లో ఒకతె ఇద్దరు దాయీ లుండేవారు. రోజువిడిచి రోజుగా వాళ్లు వస్తూ ఉండేవాళ్లు. వాళ్ల వంతుల ప్రకారం మేము ఆ ఇంటినుంచి ఈ ఇంటికీ, ఈ ఇంటినుంచి ఆ ఇంటికీ మారుతూ ఉండేవాళ్లం. మా వాళ్లకుగాని వాళ్ల వాళ్లకుగాని ఈ ఏర్పాటు ఏమీ విడ్డూరంగా కనిపించ లేదు.

పైగా, వీధిలో మే మిద్దరమూ ఒకే ప్రేమ్‌లో కూర్చుని పార్కుకు పోతూ కీచులాడుకుంటూంటే, ఆ డాబామీద నించుని ఆయనా, ఈ డాబామీద నుంచుని మా నాయనగారూ క్రిందికిచూస్తూ, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ పసిపిల్లల్లాగా బ్రహ్మానందపడేవాళ్లట. వినేవాళ్లకూ, చదివే వాళ్లకూ ఇదంతా విడ్డూరంగా కనిపించినా, నిజంగా ఇలాగే మాకు మూడేండ్లు నిండేదాకా ఈ రెండు కుటుంబాలలోనూ ఏ విధమైన ఎరమరికలు లేకుండా మా పసితనం హాయిగా గడిచిపోయింది. పసికుంకలం, మాకేంతెలుసును! కాలం దానిదారిని అది నడిచి

> స్వల్పకాల వియోగం ప్రేమను పెంపొందిస్తుంది. దీర్ఘకాల వియోగం నశింపజేస్తుంది.

పోయింది. దానివెంటబడి పరుగులెట్టుతూ క్రమంగా మేమూ పెద్దవాళ్లమయ్యాము.

మూడోఏటనుంచీ ఎవరి ఇళ్లలో వాళ్లము ఉండిపోతూవచ్చాము. ఒకే స్కూల్లో మమ్ములను చేర్చారు పెద్దవాళ్లు ఐదో ఏట. కోర్టులో గానుగచెట్లక్రిందినుంచి స్కూలుకు వెళ్లాలిసి ఉండేది. దారిలో వచ్చేటప్పుడూ పోయేటప్పుడూ చెట్లనీడ దట్టంగా ఉండే చోట అతను నన్ను ఆపేసేవాడు. అప్పట్లో అక్కడచుట్టూ వేల్పుగన్నేరుచెట్లతోగుమగుమలాడే వాతావరణంలో పదిఅడుగుల ఎత్తుగల బుద్ధభగవానుని పద్మాసనమూర్తి స్థాపితమై ఉండేది. (ఇప్పుడైతేదానికెదురుగా మహాత్ముని విగ్రహాన్ని కూడానిలిపారు). క్రింద పడిఉన్న పూలు దోసిట్లో నింపుకుని నాముందుకు చేతులు చాచేవాడు. అతి సుతారంగా నేను అందులో ఒక్క పూవును మునివేళ్లతో అతనిముఖాన్ని చూస్తూ తీసుకునేదాన్ని. మిగతా పూలను తానా విగ్రహంమీద అందినంత ఎత్తుకు అన్నిచోట్లా వదేలాగా వెదజల్లేసేవాడు. నేనుమాత్రం భక్తిముద్రనుదాల్చి, ఒకచేతి కొకచేతి నానించి ఆ విగ్రహం పాదాల మీద నా పూవును ఉంచి కళ్లుమూసుకుని నమస్కరించేదాన్ని. కళ్లు తెరిచి చూచేసరికి నా నెత్తిమీదా, చుట్టూ ఇంకోదోసెడు పూలు రాలిఉండేవి.

చిన్నప్పటినుంచీ అతనికీ నాకూ పూలంటే చాలా పిచ్చి. అందుకని అత నలా చేయడం నాకు ఆనందంగానే ఉండేది. ఇంకోసారి అడిగి పోయించుకోవాలనిపించేది. కాని,నా చేతిలో ఒక్కపూవే నాకు ఘనంగా అనిపించేది, అతని దోసెడుపూలకంటే....

## 3

ఇలాగే అమాయకంగా గడిచిపోయాయి ఆ రోజులుహైస్కూలు చదువు అయిపోయింది. ఆడ పిల్లలు ఎక్కువ వేగంగా గోగు మొక్కల్లా ఎదుగుతారంటారు. కాని, నిజానికి నేనే పీలగా ఉండేదాన్ని. వారు మెట్రిక్‌లోకి వచ్చేసరికే 5' 6'' పొడుగున మంచి పుష్టిగల విగ్రహంగా తయారైనారు. మెట్రిక్ పెద్ద పరీక్ష ఇంకా రెండు నెల లున్నవనగా, మా నాన్నగారికి పెద్ద జబ్బు చేసింది. డాక్టరుగారిని పిలిపించాము. ఆయన మా నాన్నగారిని పరీక్ష చేసినపిమ్మట మమ్మందరను గదిలోంచి వెళ్లిపొమ్మన్నారు. మా నౌకరును పంపి ఇంజనీరుగారిని పిలుచుకురమ్మన్నారు.ఉన్నపాళంగా వారూ వచ్చేశారు. తరువాత వారు ముగ్గురూ కలిసి ఆ గదిలో ఎంతోసేపు మాట్లాడు కున్నారు. ఆఖరుకు వారు విషాదగంభీరమైన ముఖంతో ఇంటికి వెళ్లిపోవడమాత్రం చూచి నట్లు నాకు గుర్తు.

15 రోజుల తరువాత రెండిళ్లలో ఏవో అప్పడాలు, వడియాలు, అద్దుండల హడావిడీలు జరుగుతున్న సంగతి చూచేదాకా

మాకిద్దరికీ వివాహం చేయడానికి పెద్దలు తలపెట్టారని తెలిసిందికాదు. ఆ సంగతి తెలిసిన తరువాతమాత్రం అతన్ని నేను చిన్ననాటి రామూలాగానే చూడలేకపోయాను. అతను రోజూ నాకు పూలుతెచ్చి పెట్టే నేస్తమేగా అనుకోలేకపోయాను. ఆ చనువు, ఆ స్వతంత్రతా, ఆ మాలిమీ, ఆ కలుపుగోలు తనమూ అన్నీ మటుమాయమైపోయాయి. కొరడా పుచ్చుకొని బండితోలడానికి సిద్ధమైన జట్కావాలాను గుర్రమెలా చూస్తుందో, అలా చూడసాగాను అతన్ని. ఒక్క నిమిషంలో వచ్చిన ఈ మార్పు నాకే అర్థం కాలేదు. కాని చిన్నప్పటినుంచీ నన్ను ముంచెత్తివేసిన నా సిగ్గరితనం ఈ కల్లోలాన్ని అణచివేసింది. ఎలాగైతేనేం వివాహం జరిగిపోయింది.

పరీక్షలైనాయి. వివాహం విద్యను నాశనం చేస్తుందని అందరూ అంటారు. కాని ఆ సూత్రం అందరికీ వర్తించదు. ఆడవాళ్లలో నేనూ, మగవాళ్లలో వారూ, ఇద్దరమూ ఫస్టున ప్యాసైయాము. మా రిజల్ట్సు మా నాన్నగారు వినే భాగ్యం మాకు లేకపోయింది. మొదట్లో పరీక్ష చేసినప్పుడే డాక్టరుగారు రోగతీవ్రతను గుర్తించి, ఇంకా రెండు నెలలకంటే వ్యవధి లేదనీ, ఈ లోపునే చేసుకోదలచిన పనులను చేసుకోవలసినదనీ చెప్పారనీ, అందుకనే వరహీనమని మా బంధువులందరూ ఆటంకపెట్టినా, మా వివాహాన్ని తాము కళ్లతో చూచి మరీ చచ్చి పోదామని మా నాన్నగారే ఇంజనీరుగారితో ఆలోచించి అంతత్వరగా మా వివాహానికి ఏర్పాట్లుచేశారనీ ఈ కథంతా జరిగిన తరువాతగాని మాకు తెలిసిందికాదు. స్కూళ్లకు సెలవులిచ్చిన తరువాత నిజంగా తాను జట్కావాలావంటి మనిషిని కాదని మావారు చక్కగా ఋజువు చేసుకున్నారు. ఈ జన్మనుంచి ఇంకోజన్మ నెత్తించి నా నిద్రను మాన్పి నిరతిశయమైన ఆనందసాగరంలో నన్ను ముంచెత్తేశారు. ఆ రోజుల్లో వారి మనస్సూ నా మనస్సూ ఎలా ఉన్నాయో మొదట్లోనే విన్నవించుకున్నాను.

## 4

వివాహమైన తరువాత నన్నుమాత్రం చదువు మానిపించేశారు. వారు పూనా ఇంజనీరింగు కాలేజీలో చేరి బి.ఇ. చదవడం ఆరంభించారు. కాలేజీలో చదువుకునే రోజుల్లోనే వారు రిజర్వాయర్లను గురించీ, నదుల నీటిని పరివర్తనంచేసి ఎడారి దేశాలను సుక్షేత్రాలుగా చేయడాన్ని గురించీ, భూ గర్భ జల నిక్షేపాలను వ్యవసాయానికి ఉపయోగించుకోడాన్ని గురించీ పెద్దపెద్ద స్కీములు తయారుచేసి ప్రభుత్వానికి పంపేవారట. అందువలన విద్యార్థిదశనుండి కూడా వృద్ధికి రాదగిన వ్యక్తిగా గవర్నమెంటు వారిని గుర్తించింది. పూనాలో వారు విద్యాభ్యాసం చేసే సమయంలోనే రెండుమూడు సార్లు మా మామగారితో కలిసివచ్చి ఒక్కొక్కసారి మా వారితో రెండు మూడు నెలలు తక్కువ కాకుండా కాలక్షేపం చేశాను.

• • •

పూనాకు వెళ్లిన తరువాత వారు బాగా మారిపోయారు. అక్కడి వాతావరణం వారి మనస్సుకు హద్దులులేని విస్తీర్ణతను కల్పించింది. ఇదివరకులాగా వారు ఇంట్లోనూ, పార్కులోనూ కూర్చుని గంటలతరబడి నాతో చిలిపి ఆటలన్నీ ఆడుకుంటూ, నా కళ్లలో కళ్లుపెట్టి చూస్తూ, నన్ను నవ్విస్తూ, తాము నవ్వుతూ, మేమిద్దరం తప్ప ఇతర లోకం లేదనిపింపజేసే వారితత్వం మారిపోయింది. వారి దృష్టి వ్యక్తి సౌందర్యం మీదినుంచి లోక సౌందర్యం మీదికి విస్తరించింది. ఈ సంగతి నీ కెలా తెలిసిందంటారూ! ఆయా సమయాల్లోనే వారు నన్ను కార్లా, అజంతా, ఎల్లోరా గుహలకు తీసుకొని వెళ్లి అక్కడ ఉండే అమూల్య శిల్పైభవాన్ని చూపించారు. అజంతాలోని స్త్రీ ప్రతిమలనూ, చిత్రాలనూ చూపి వారు వాటి అంగాంగ విలాసాలనూ, నేత్ర భంగిమలనూ లోకాతీతంగా వర్ణిస్తూంటే 'నాలో ఇవన్నీ లేవుకాబోలు. మీరు వీటిమీద మోజు పడ్డారు. లేకుంటే ఎందుకీ వర్ణనంతా' అని నేను అనేసేదాకా వారా ప్రసంగాన్ని విడిచిపెట్టేవారు కారు. నా మాటలు వారికి నవ్వు తెప్పించేవి.

మహాబలేశ్వరంలో బ్యూటీ పాయింట్సును చూపిస్తూ ఈ అనంత విశాల ప్రకృతి లావణ్య విన్యాసాలను చూడమని గంటలకొద్దీ ఉపన్యాసమిస్తూంటే, నాకు ఇంటికి ఎప్పుడు వెళ్లిపోదామా అనిపించేది. ఇంట్లోనే నా ఎదుట కూర్చుని నా కన్నుల్లోంచి సర్వ ప్రపంచ సౌందర్యాన్నీ చూడగలిగిన వీరు తమ పూర్వ ప్రతిభను ఎలా మరిచిపోయారూ? అని విస్తుపోయేదాన్ని.

చక్కని సంగీతమూ, పరిధిలేని భక్తి రసమూచిప్పిలుతుండే దిలీప్‌కుమార్‌రాయ్ భక్తి భజనగానాలకు తీసుకుని వెళ్లేవారు. అక్కడా నాకు ముళ్లమీద కూర్చున్నట్లే ఉండేది. ఒక్కటి మాత్రం నాకు అర్థమయ్యేది కాదు—చిన్నప్పటినుంచి వారు పూలతో పూజించిన నా మూర్తిని, వారు ఆరాధించిన నా మనస్సును, తమ జీవితంతో ఐక్యం చేసుకున్న నా జీవితఫలాన్ని వీటి అన్నింటి అంచులనూ దాటి, వారి దృష్టి అంత సులభంగా లోకంలోని ఇతర సౌందర్యాల మీదకు ఎందుకు ప్రసరించగలిగిందో, ఎందుకు ప్రసరించవలసివచ్చిందో అది నాకు తెగని సమస్యగా ఉండేది.

అయితే నీవు అతన్నుంచి ఏ మాశించావని మీరు న న్నడుగుతారేమో! మనస్సాక్షిగా చెబుతాను. సోదరీమణులే నా మాటలను విని అర్థం చేసుకోండి. పురుష జన్మలకు ఈ మాటలు అర్థంకావు. వారు అర్థం చేసుకోలేరు; చేసుకోరు.

చిన్నప్పటినుంచీ వారినుంచి నే నాశించినది ఈ ఒక్కటే. వారుతప్ప నా కీ లోకంలో ఏ విలాసమూ, ఏ కోరికా, ఏ ఆనందమూ, ఏ సల్లాపమూ ఉండగూడదనీ, వారు గూడా నాతో అలాగే ఉండాలనీ నేను వాంఛించాను. దానికోసమే తాపత్రయపడ్డాను. కాని నాకు మాత్రం వారి భావం అలా ఉన్నట్లు తోచలేదు. వారి భావంలో నేనంతా వారి స్వంతాన్నై పోవడమే కాకుండా, వారికి వచ్చిన లోకమంతటితోనూ నే నైక్యమైపోయి, నాకు వ్యక్తిత్వ మేమీ లేకుండా పోవాలనుకున్నారేమో

(తరువాయి 49వ పేజీలో)

# "చంద్రకళ"

## వేటూరి ఆనందమూర్తి

అందమైన చంద్రకళ
చిందే మధు చంద్రికల
ఎందుకనో ఏమో - ఆ
నందమాయె నీ వేళ.

నవమినాడె నాలో - పు
న్నమి వెన్నెల విరియించెను.
తొవ కన్నులలో నెలకొని
నవనవమై మురిపించెను.

తీయని తలపుల నల్లుచు
మాయని మమతల పెనగుచు
నా యెద పూ పందిరిలో
నవ్వినట్టి నవ మల్లిక.

వాకలగుచు రే వెలుగుల
రేకలు సారించు మొలక
నా కన్నుల నాట్యమాడు
నవసుధా ప్రదీప కళిక.

రాగబంధ మిదియే - అను
రాగబంధ మిటులే యని
నాగళమ్ము నదుముకొన్న
నవముక్తాహారలతిక.

# పాన్‌షేత్ భగ్నప్రణయిని

(11 వ పేజీ తరువాయి)

అనిపిస్తుంది.

కాకపోతే తన కన్నుల్లో కన్నులు కలిపి చూచే మగవాని మాటలు, అజంతా కాంతల నయనాంచలాలను మెచ్చుకుంటే ఏ స్త్రీ సహిస్తుంది చెప్పండి?

నీ శరీర సౌష్ఠవం రతీదేవికిలాగా, నీ మెడ వంపు వీనస్‌కు లాగా, నీ కాళ్ల అందం బెట్టీ డేవిస్‌కులాగా నిర్మాణమై ఉన్నదంటే, ఏ ఆడదాని హృదయం భగ్నమవదో ఆలోచించండి? నా శరీరం నాదే, నా మెడ నాదే, నా కాళ్లు నావేకాని, నన్ను చూస్తున్న నా పురుషునికి రతీదేవీ, వీనసూ, బెట్టీడేవిసూ జ్ఞాపకానికి వస్తూంటే నా బ్రదుకు కేమయినట్లో చెప్పండి? నా వ్యక్తిత్వ మే యేట్లో కలిసిందో ఆలోచించండి?

అతడు నన్ను ముద్దు పెట్టుకుంటూ బెట్టీ డేవీస్‌ను ముద్దు పెట్టుకుంటున్నట్లుగా మనసులో తృప్తిపడుతూంటే ఈ మానసిక వ్యభిచారానికి బానిస కావడానికి ఏ ఆడది తలఒగ్గుతుందో సెలవీయండి. కళాసిద్ధాంతాలు నా ఊహలకు విరుద్ధంగా ఉండవచ్చుగాక... ఆడు జన్మఎత్తిన నేను మాత్రం ఇది సహించలేకపోయాను.

## 5

అనతికాలంలోనే మావారు మహారాష్ట్ర దేశంలో చీఫ్ ఇంజనీరు పదవి నలంకరించారు. మేమూ పూనాలోనే కాపురం పెట్టాము. మా ఇల్లు ఇంద్రభవనంలాగా ఉండేది. నౌకర్లతో, చాకర్లతో, వచ్చిపోయే ఆఫీసర్లతో, ఆప్త మిత్రులతో అతి కోలాహలంగా ఉండేది. ఆఫీసు పనులు అధికంగా ఉండడంవలన మావారికి అసలు నాతో మాట్లాడడానికిగాని, పలుకడానికిగాని ఎన్నడూ తీరుబడి ఉండేది కాదు. పగలల్లా నడుం విరిగేలా చాకిరీచేసి వచ్చి పట్టెమంచంమీద మేనానించేసరికే వారికి ఆవలింతలు వచ్చేవి. రాత్రిళ్లు ఇంటికి కూడా ఫైళ్ల బండిల్సు వచ్చి పడుతూంటే వాటితోటే వారికి కాలక్షేపమైపోతూ ఉండేది.

ఎన్నడైనా ఒకరోజు సెలవు తీసుకొని ఇంటికివచ్చి కూచుంటే అర్జంటుగా రమ్మని బొంబాయినుండి ట్రంకు టెలిఫోను వచ్చేది. ఒకసారి బొంబాయి వెళ్ళితే మళ్లీ వారంరోజులదాకా వచ్చేవారుకారు. ఇంటివద్ద నిమిషాని కిరవైసార్లు మ్రోగే టెలిఫోనుకు జనవాళ్లకూ, కానివాళ్లకూ జవాబు చెప్పడం మాత్రమే నాకు విరామంలేని నిత్యవిధి ఐంది.

ఈ అవాంతరాలన్నింటినీ తప్పించుకొని ఎన్నడేనా ఒక్కసారి వారు ఇంట్లో ఉండడమే సంభవిస్తే, బస్టోఫైనులూ, లిప్‌స్టిక్కులూ, పంజాబీ డ్రెస్సులూ, బాబ్‌డ్‌హెయిర్లూ ధరించిన హైహీల్డుయువతుల బృందంతో సకుటుంబంగా ఎవరో మిత్రాతిమిత్రులు దయచేసేవారు. వాళ్ల మర్యాదలకోసం నా మనస్సును నేను చంపుకుని అరవచాకిరీ అంతా వాళ్లకు చేస్తూ, మావారి కళ్లను, శ్రద్ధను, చిరునవ్వులను, సరదాలను నా మనస్సును కత్తిపీటగాచేసి తరిగి వాళ్లకు వడ్డిస్తూ, నా జీవితాన్ని వాళ్లకు బలిదానంచేస్తూ ఉండేదాన్ని.

ఇలాంటి దుర్భర జీవితంలో మునిగి కుళ్ళి చావడానికి నేనేం పాపం చేశా ననిపించింది! ఇందులో నేను చేసిన తప్పే మనిపించింది! దీనికి కారణం నేనా, వారా అనిపించింది! నా బాధ తెలుసుకోలేని అసమర్థత నా భర్తది కాక పోతే నా దెలా ఔతుందీ అనిపించింది!


నా మనసు విరిగిపోయింది.

## 6

మగవాళ్ళకు అంతఃకరణమూ, ఆవేశమూ, ఆవేదనా ఉండదనుకోవడం సామాన్యంగా ఆడ జాతి చేసే పొరపాటు. అయితే కొంతమందికి మాత్రం ఈ ఆవేశాలూ, ఆవేదనలూ భార్య పుట్టింటికి పోయినప్పుడూ, పరాయి ఆడ పురుగు కనబడినప్పుడూ, రుచిమరిగిన వ్యక్తిని మరిచిపోవల్సి వచ్చినప్పుడూతప్ప, వాళ్ళు ఎదురుగా ఉన్నప్పుడు అభివ్యక్తంగావు. మావారికి పై లోపాలు ఏవీ లేకపోయినా దూరపు క్యాంపులు వేసుకుని చాలా రోజులు ఉండవలసి వస్తే మాత్రం చాలా బాధపడేవారు. పోయే ముందు నా లాలనలన్నీ మనసారా పొంది తేలిక పడ్డ మనస్సుతో, శరీరంతో పోతే కాని వారికి క్యాంపులో కాగితాలు చూచుకోడానికి కూడా మతి ఉండేది కాదు. రుచించినా రుచించక పోయినా ఆ విధంగానే నేనూ భార్యా ధర్మాన్ని నెరవేరుస్తూ ఉండేదాన్ని.

ఈ బాధలు తప్పించుకోడాని కేమో అన్నట్టు చాలాసార్లు వారు నన్ను కూడా తమతో క్యాంపులకు తీసుకువెళ్ళుతూ వచ్చారు. చివర చివరకు ఈలాగా నన్ను విడిచి వారు ఉండలేకపోవడము చాలా ఎక్కువౌతున్నట్టు కనిపిస్తూ ఉండేది. నాకు మాత్రం అన్నివిధాలుగానూ మా సంబంధం బొత్తిగా దైహికంగా దిగజారి పోయిందని విచారం కలుగుతూనే ఉండేది. వారి మనసంతా నౌకరీమీద లగ్నమైపోవడం వలన నా కందులో ఏమీ భాగం లభించేది కాదు. మానసికంగా, ఆత్మీయంగా జీవితంలో ఆనంద

హెరాం సినిమా ప్రొజెక్టరుకు
ఆర్డరు యివ్వండి.




ఇంటిలో అద్భుతమైన వినోదం


సాహసాలు, ప్రేమ, వగైరా దృశ్యాలు మీ ఇంట్లోనే మా ప్రొజెక్టరుతో చూడండి. టార్చితో గాని ఏసి/డిసి ఎలెక్ట్రిసిటీతోగాని పని చేయును. 35 ఎం. ఎం. ఫిలిం. ధర రు. 15.40 ఫిలిం 4'×3' స్క్రీన్, ఇన్‌స్ట్రక్షన్సు ఉచితం పోస్టేజి రు. 4—50 న.పై. డీలక్సు స్పెషల్ రు. 25. 60' ఫిలిం స్క్రీన్, ఇన్‌స్ట్రక్షన్సు ఉచితం. పోస్టేజి రు. 5. తృప్తిలేనిచో సొమ్ము వాపసు. స్టాకు మితంగాఉన్నది. నేడే ఆర్డరివ్వండి.

**Hollywood Cinema Corpn. (Regd.), (APW), 2194, Kalyanpura, Delhi-6.**

సినిమానటులు

మీరు సినీకారులుగాచేరి, నెలకు మంచివరుమానం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను.

**BOMBAY FILM SERVICE, (W.A.P.) PHAGWARA (N.R.)**



# పాన్‌షేత్ భగ్నప్రణయిని

మాధుర్యం అభిలషించిన నా కది కరవు కావడంతో నా జీవితమే ఎడారి అయిపోయింది.

పై విధంగా నన్ను తీసుకువెళ్ళిన క్యాంపులలో పాన్‌షేత్ మట్టి డాము ఒకటి. అప్పట్లో అది క్రొత్తగా నిర్మాణమవుతూ ఉంది. 180 అడుగుల ఎత్తైన చిన్న కొండలాగా పడుకుని అది రెండు ప్రక్కలాపాయిగడ్డల్లా నిలిచిఉన్న ఎత్తైన కొండలను కలుపుతూ ఆ కొండలను చీల్చుకుని వచ్చే అంబీ నది నడ్డుకుని నీటి నరికట్టి, ఒక బ్రహ్మాండమైన సరస్సును మధ్యన తయారు చేస్తున్నది. అప్పట్లో దాని నిండా నీళ్ళు నిండుతున్నాయి.

మట్టితో కట్టబడిన ఆనకట్ట కనుక అది గట్టిపడేదాకా నీటి లెవెలు తగుమాత్రంగానే కొన్ని సంవత్సరాలదాకా ఉంచవలసి ఉంటుందనీ, గట్టిపడిన తరువాత నిండా నీటిని ఆపే బలం దానికి లభిస్తుందనీ వారు చెప్పారు. ఈమధ్య కూడుకునే అదనపు నీరును విడుదల చేయడానికీ, డామును ఆకస్మిక ప్రమాదాలనుంచి రక్షించడానికీ నిర్మింపబడిన పెద్ద పెద్ద స్లూయిస్ తలుపులను కూడా వారునాకు చూపించారు.

10 మైళ్ళ దిగువన ఖడక్‌వాసలా సిమెంటు డామున్నది. అక్కడ నుంచే పూనా అంతటికీ నీటి సప్లయి జరుగుతుంది. సిమెంటు డాముకు ఎగువగా అదే నదిమీద మట్టి డామును ఎవరైనా కట్టుకుంటారా, కొట్టుకుపోతే రెండూ ఒక్కసారే పోతాయి గదా అనుకున్నాను. కాని ఇంజనీరింగు రహస్యాలతో మన కేం పని అని ఊరుకున్నాను.

క్రిందన ఉండే వందలాది గ్రామాలకు విద్యుచ్ఛక్తినీ, మంచినీటినీ ఈ పాన్‌షేత్ సరస్సు ఏ విధంగా సరఫరా చేస్తుందో, అంత మహోపకారకమైన ఆనకట్టను తా మేవిధంగా ప్లానులువేసి నిర్మింపజేశారో ఆ సంగతులన్నీ వారు నాకు వర్ణించి చెప్పారు. డాము పరిమాణాన్ని, దానివలన కలుగనున్న అతి భావ్యమైన ప్రయోజనాన్నీ, ఆ ప్రయోజనాన్ని పొందే ప్రపంచ వైశాల్యాన్నీ, అందులోని ప్రజాసమూహాన్నీ, ఆ కొండ కొసను నిలిచి చూస్తూ తలుచుకుంటూ వీటి అన్నింటితోబాటు నా జీవితానికి కూడా కారణభూతంగా ఎదుట నిలిచిఉన్న నా చీఫ్ ఇంజనీరును కన్నారా తిలకించి క్షణం సేపు ముగ్ధనైపోయాను.

ఇంతలో వా రొక్క మాట అన్నారు:

“ఉమా! నా జీవితాన్ని పరిశీలించుకున్నకొద్దీ నీ కాళ్ళక్రింద పడిఉన్న డాము నేనే అనిపిస్తున్నది.”

కలలోనుంచి విరిగి బయటపడినట్లుగా ఆ మాటలు విని “మరి నేనో” అన్నాను.

“నీవు ఆ ఎత్తుగా కనిపిస్తున్న ఫ్లడ్ గేటువు!!” అన్నారు వారు.

“ప్రమాద సమయాల్లో తప్ప ఆ ద్వారానికి ఉపయోగం లేదు కదా?”

“నిజమే! ఆ ద్వారం అవసరమయినప్పుడు తెరుచుకోకపోతే డాముకు ప్రమాదమే! డాము కేమిటీ? ఈ పర్వతంమీదనుంచి కనుచూపుకు నీ కెంతవరకు కనిపిస్తున్నదో అంత మేరా ఉజాడైపోయే జలప్రళయం వస్తుంది” అన్నారు.

## 7

ఈ సంభాషణ జరిగి మూడేండ్లయింది. పైన చెప్పిన రీతిగా దైహిక వాంఛా విరక్తి రేకెత్తి, రోజు రోజుకూ నాలో ఎక్కువ కాసాగింది. అది ఎక్కువైనకొద్దీ నేను మా వారి నుండి దూరమైపోవడం కూడా ఎక్కువైంది. ఊరికే ప్రాధేయపడేవారు వారు. అది నా విరక్తిని మరీ ఎక్కువ చేసేది. కళ్ళముందర అజంతా బొమ్మలు భగ భగ మండిపోతూ కనిపించేవి.

అలా ఉండడంవలన నా అంతరాత్మ ‘అతనికి తగిన శాస్తి జరుగుతున్నదిలే’ అని జపిస్తున్నట్లనిపించేది. మలేరియా రోగి దాహానికి వేడినీళ్ళ ఉపశాంతిలా నా మనస్సులోని ఉడుకుకు ఆ ఊహలు శాంతి నిచ్చేవి. అలాఉంటున్నావారు నన్ను క్యాంపులకు తీసుకువెళ్ళడం మానేవారు కారు. కనీసం నేను కళ్ళ ఎదుట మెదులుతున్నా చాలనే వారు.

ఈ ఏడు ఎన్నడూ అనుకోనట్లుగా వర్షాలు కురిశాయి. నదులూ సెలయేళ్ళూ గట్లు త్రెంచుకుని పొర్లి ప్రవహించాయి. పాన్‌షేత్ మట్టి డాముకు ప్రమాదము రానున్నదనీ, భద్రతా


THE FINANCIAL EXPRESS

*is glad to announce the expansion of its*

**INVESTMENT SERVICE**

to cover

* INVESTMENT ADVICE,
** INVESTMENT LITERATURE, AND
*** INVESTMENT MANAGEMENT.

**The subscribers, who have remitted a year's subscription to any of our offices directly or through authorised agents, will be entitled to:**

a: free advice on their investment portfolio twice a year, and

b: answers to 24 questions relating to 24 Indian scrips in a year free of charge.

Enquiries from others on Indian scrips will be entertained on payment of one rupee per scrip per question.

**All correspondence in this connection will be kept strictly confidential and replies will be mailed free of cost.**

**Payment should be made by crossed Indian postal orders drawn in favour of Indian Express Newspapers (Bombay) Ltd.**

**Free Service To Readers**

*Replies to readers' questions on investment now published on Mondays will also be published on Wednesdays and Fridays in order to cope with the growing number of queries.*

All correspondence regarding the investment service should be addressed by subscribers and readers to the City Editor, The Financial Express, Newspaper House, Sassoon Dock, Bombay 5.




చిత్రం—కలువకొలను సదానంద (వెంకట్రామాపురం)

చర్యలు తీసుకోవలసిందని వైర్లమీద వైర్లు వచ్చిపడ్డాయి. అదే ఆఖరి క్యాంపు నన్ను తమతో మా వారు తీసుకువెళ్ళడం. వరద ఎద్దడి చూదామనే కుతూహలంతో, ఉత్సాహంతో వెళ్లాను నేను కూడా క్యాంపుకు.

మావారు అన్నాహారాలు మానివేశారు. క్రింది ఇంజనీర్లందరకూ వేరు వేరుగా వరద డ్యూటీలు నియమించారు. రక్షణ సిబ్బందిని డాముకు కాపలా వేశారు. దుంగలు, దూలాలు, డ్రమ్ములు, సిమెంటు బస్తాలు వేలకొలది తెప్పించి డాము దగ్గర నిలవచేశారు. సివిలు, మిలిటరీ ఇంజనీరింగు ఎక్స్పర్టు సలహాదారులను, యంత్ర సామగ్రిని సిద్ధంగా దగ్గరకు తెప్పించుకున్నారు. గంట గంటకూ షిఫ్టు డ్యూటీలు పెట్టి జూనియరు ఇంజనీర్లను డాముమీదనే 24 గంటలూ కాపలాకూ, చెక్కింగు పనికీ వేశారు. క్షణ క్షణమూ వైర్లెసు ట్రాన్సుమిటరుమీద వరద లెవెలును, ఆనకట్ట కట్టుదిట్టాలను గురించి బొంబాయికి వార్త అందజేస్తున్నారు.

నేను ఒకదాన్ని వారితో క్యాంపుకు వచ్చాననే సంగతే మరచిపోయారు. కాఫీ తీసుకునివెళ్ళి ఎదుట గంటసేపు నిలబడి ఉన్నా, వారికి నేను కనబడేదాన్ని కాను. వైర్లెసు టెలిఫోనులు రెండూ రెండు చెవులలో పెట్టుకుని వారి లోకంలో వా రుండేవారు.

* * * *

వరద ఎక్కువౌతున్నదని తెలియగానే క్రింది ఖడక్‌వాసలా డాము స్లూయిస్‌గేట్లన్నీ ఎత్తించి వేశారు. బ్రహ్మాండంగా ప్రతి ద్వారంనుంచీ డాముక్రిందికి పడుతున్న జలపాత ధారలు దూరానికి ప్రళయదేవత పెదవులు విప్పి ఇకిలిస్తున్న పెద్ద పెద్ద పళ్ళలా కనిపించాయి. కాని ఎంత నీరు క్రిందికి పోతూంటే అంతకంటే ఎక్కువ వరదనీరు పైన ఆంబీనదినుంచి వచ్చి పడుతున్నదని వార్త అందింది. మావారు పాన్‌షేత్ డామును ప్రమాదాన్నుండి రక్షించడానికి వరద గేటును ఎత్తివేయమన్నారు. బయట ధారాపాతంగా వర్షం కురుస్తున్నది. తాము కూడా డాము వరదగేటు దగ్గరకు పోవడానికి సిద్ధమై గుడ్డలు వేసుకుంటూ,

"ఉమా! ఈ రోజు ఏ రోజు! ఫ్లడ్ గేటు తెరుచుకోకపోతే ఇక ఆనకట్ట నిలవదు. ఇంతవరకు అది నీ మీది ఆశాబలంతోటే నిలిచిఉంది. నాలో బలం ఎన్నడో క్షీణించిపోయింది. ఆనకట్ట నిలవకపోతే క్రింద వందలాది గ్రామాలూ, వాటిలోని భూత ప్రపంచమూ నిలవవు. ఏదీ ఒక్కసారి! ఆఖరిసారి!!" అని ప్రాధేయపడ్డారు.

నన్నేదో భూతం ఆవహించింది. ప్రళయం రావడానికి కూడా నేనే నేరస్థురాలిని కావాలా? అనిపించింది. నేను వారిని తోసేశాను.

"ఆనకట్టా! ఆకుల కట్టా! నన్ను తాకకండి! నాకీ వెర్రి వెంకటాయి పనులంటే ఇష్టం లేదు. ప్రపంచం పోతున్న దంటారూ? నాకు గాని ప్రపంచం ఉండేం? లేకేం?" అన్నాను.

వారు మళ్ళీ మాట్లాడలేదు. ఇంతలో డాముమీద పని చేయిస్తున్న డ్యూటీ ఇంజనీరు పరుగున వచ్చాడు. వరద గేటును ఎత్తే మెయిన్ స్క్రూ రాడ్ విరిగిపోయిందనీ, తలుపెత్తడానికి ఇక సాధ్యం కాదనీ చెప్పాడు. మావారు ఒక్క గెంతుతో గుమ్మమవతలికి దూకేశారు. తరువాతనాకు తెలిసిన సంగతు లివి...

వరద గేటు పైకి లేవకపోవడంతో నీటి మట్టం నిమిషానికి రెండడుగు లెక్కువై పోయింది. డాము పై భాగం మీదినుండి నీరు పార్లి క్రిందికి దూకడం ఆరంభించింది. ప్రళయ కాల ఝుంఝూమారుతంలాగా ఉప్పెన గాలి విసరడం మొదలుపెట్టింది. ఏనుగు తొండం లాంటి ధారలతో వర్షం పడుతూనే ఉంది. గాలికి పదేసి అడుగుల ఎత్తున అలలు లేచిపడి మట్టి డామునూ, వరద గేటు పై భాగాన్నీ కొట్టుకుని, పై రోడ్డునూ మట్టినీ తినేయడం ఆరంభించినవి. డామంతా గజగజ లాడ సాగింది. ఒకమూల డాము క్రుంగిపోయింది.

ఆ పరిస్థితిలో ఆ ప్రచండ ప్రవాహంనుండి దూరి క్రిందికి జారి, వరద గేటుకు పైనుండి వేసిన ఉక్కు కొక్కెమును ఎలాగైనా తగిలించితే తలుపును పైకి ఎత్తవచ్చునని ఇంజనీర్లందరూ అభిప్రాయపడ్డారు. ఎవరలా కొక్కెం తగిలిస్తారో వారికి 5,000 రూపాయలు ఈనామిస్తామని ప్రకటించారు. కాని ఎవరూ అందుకు సాహసించలేదు. మావారే నడుముకు లైఫ్‌లైన్ బిగించుకుని, క్రిందికి జారడానికి ప్రవాహంలో దూకారు. ప్రవాహం వారిని క్రిందికి పోనివ్వకుండా ఫోరాధారామీద బంతినిలాగా, తోక తెగిన గాలిపటాన్నిలాగా విసిరిపడేస్తూ గిరా గిరా త్రిప్పేస్తూ పైకి క్రిందికీ ముంచుతూ లేవనెత్తుతూ వారిని నానా హింసలూ పెట్టింది. గట్టుమీద జనం వారిని తిరిగి చేదుకోదలుచుకుంటూ ఉన్న సమయంలోనే లైఫ్‌లైను కూడా తెగిపోయింది. తెగిపోయిం దేమిటి, ప్రవాహం దాన్ని త్రెంచేసింది. దానితో వారు ప్రవాహంతోబాటు 180 అడుగుల లోతున క్రింద పాషాణాలమీద పడి అక్కడనుంచి ఏమయ్యారో ఇక కనిపించలేదు.....

గత్యంతరంలేక ఆ మహాద్వారాన్ని మిలిటరీ ఇంజనీర్లు డైనమైటుచేసి బ్రద్దలు కొట్టారు. అదివరకే చాలా చోట్ల గండ్లు పడుతున్న పాన్‌షేత్ మట్టి డాము ఈ దెబ్బతో ఆంబీనది ఆగ్రహానికి ఆగలేక పూర్తిగా గండిపడి వెనుక నరికట్టి ఉంచిన మహా సముద్రాన్ని ప్రపంచంమీదికి విడిచిపెట్టింది. దాని తాకిడికి ఆగలేక ఖడక్‌వాసలా సిమెంటు డాము విచ్చిపోయింది. మూలానది దానితో పొంగిపోయి తన కిరువంపుల నున్న భూత ధాత్రినీ ధ్వంసంచేసి విడిచిపెట్టింది. దీనివలన పూనా పట్టణానికీ, ఇతర గ్రామాలకూ మితిలేని నష్టం కలిగింది. నది కిరువైపులా ఉండే నాలుగు అంతస్థుల మేడలు కూడా కూలిపోయాయి. 60 అడుగుల ఎత్తున వచ్చిన ఆ ప్రవాహంలో తేలిపోయి, ఆడంగులూ, పిల్లలూ ఎలెక్ట్రిక్ స్తంభాలకూ, చెట్ల కొమ్మలకూ, బ్రిడ్జి కొసలకూ చిక్కుపడి ఆరేసిన గుడ్డపీలికల్లా వేలాడారు. లక్షలాది విలువగల ఆహార సామగ్రిని నిలువచేసిన సర్కారు రేషను గిడ్డంగులు కొట్టుకునిపోయాయి. బ్రిడ్జీలు కూలి నదీగర్భంలో కలిశాయి. లక్ష ప్రజలు కట్టు గుడ్డలతో రైల్వే లైనుమీద నిలబడి, తినడానికి తిండీ, తలదాచుకోడానికి పంచా లేక హాహాకారాలు చేశారు. ఎలెక్ట్రిక్ లైనులు, తంతి తీగలు, మంచి నీటి గొట్టాలు—అన్నీ తెగిపోయాయి. త్రాగడానికి నీరు లేక పూనా ప్రజలు అల్లాడిపోయారు. ఈ ప్రళయ గాథను పత్రికలలో చదివి ప్రపంచ మంతా ఈపాటికి తెలుసుకునే ఉంటుంది.

కాని దీని వెనకాల ఒక దౌర్భాగ్యురాలి ఆరిపోయిన ప్రణయ గాథ కూడా కొడిగట్టి ఉన్నదని ఎవరికి తెలుస్తుంది—ఈ మూగ బుద్ధ దేవుని మూర్తి ముందర మువ్వేళ్ళతో ఒక్క గన్నేరు పూవును పట్టుకుని నిరీక్షిస్తూ కూర్చున్న ఈ భగ్నప్రణయినికి తప్ప? ★